# క్షమించు నాన్నా!

-అబ్బరాజు జయలక్ష్మి

"అమ్మాయితో మాట్లాడాక మీకు ఏ సంగతి తెలియజేస్తానండి" అన్నారు రామచంద్రయ్యగారు కళ్లజోడు సవరించుకుంటూ.

"మీరిలా నానుస్తూ ఉంటే ఈ సంబంధం చేయిదాటిపోతుందండీ. బంగారంలాంటి సంబంధం. ఈ అబ్బాయికి ఏ వంకా పెట్టడానికీ అవకాశంలేదసలు."

"అవుననుకోండి. మీకు తెలుసుకదా. అమ్మాయి పట్టుదల. తనతో ఒక్క మాటైనా చెప్పకుండా మీకు నేను మాటివ్వలేను. సాయంత్రం అమ్మాయి వచ్చాక మాట్లాడి తనను ఒప్పించే ప్రయత్నం చేస్తాను. మీరు మరోలా అనుకోవద్దు."

"సరే మీ ఇష్టం. కాస్త గట్టిగా నచ్చచెప్పే ప్రయత్నం చేయండి. వీలయినంత తొందరలోనే ఏ సంగతి చెప్పండి. లేకపోతే ఇంత మంచి సంబంధం తప్పిపోయిందని ఆనక మీరే విచారించవలసి వస్తుంది. నేను చెప్పవలసింది చెప్పాను. ఇక మీ ఇష్టం మరి'' అంటూ పై కండువా సవరించుకుంటూ లేచి గేటు తీసుకుని బయటకు వెళ్లాడు పేరిశాస్త్రి.

★★★

జాహ్నవి చాలా అందంగా ఉంటుంది. అందానికి తోడు అతిశయం కూడా ఎక్కువే. అసలు ఎవరూ ఆమెకు నచ్చరు. కాలేజీలో చదివినన్నాళ్లూ ఎవరితోనూ స్నేహం కూడా ఎక్కువగా చేసేదికాదు.

తోటి విద్యార్థులకే కాదు లెక్చరర్లకు కూడా పేర్లు పెట్టి ఎగతాళి చేస్తూ ఉండేది. ఆమె అందాన్ని చూసి ఎవరైనా దగ్గరకు రావాలనుకున్నా ఆమె అహంభావం, నోటి దురుసుతనం ఆమడ దూరం ఉండేలా చేసేవి.

ఆమె ఆలోచనలు ఎప్పుడూ ఆకాశంలో విహరిస్తూ ఉండేవి. ఆరడుగుల అందగాడు, రాజకుమారుడు లాంటివాడు పడవంత కార్లో వచ్చి తనను వరిస్తాడని, లంకంత ఇంట్లో మహరాణిలాగా దర్జాగా బ్రతకాలని కలలు కంటూ ఉంటుంది.

అందుకే పేరిశాస్త్రి తీసుకువచ్చిన పెళ్లి సంబంధాలను ఇష్టపడడంలేదు. కొందరిని పెళ్లిచూపుల్లో చూసాక, కొందరి వివరాలు విన్నాక, మరికొంత మందిని ఫోటోల్లో చూడగానే ఇలా ఎన్నో రకాలుగా ఏదో వంకలు చెప్పి తెచ్చిన సంబంధాలన్నీ తిప్పి కొట్టేస్తోంది.

రామచంద్రయ్యగారికి నలుగురూ ఆడపిల్లలే. ఉపాధ్యాయులుగా చేసి రిటైరైన ఆయన సంపాదించింది ఆర్థికంగా ఏమీ లేకపోయినా మంచి మాష్టారుగా పేరు తెచ్చుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా కీర్తింపబడ్డారు. ఆ యశశ్చంద్రికలే ఆయన ముఖంలో ఎనలేని సంతోషాన్ని, సంతృప్తిని నింపినట్లుగా ఉంటుంది తేజస్సుతో కూడిన ఆయన రూపం.

అంతకుమించిన ఆస్తిపాస్తులను ఆయన ఏనాడూ ఆశించలేదు. వాటి కోసం ప్రాకులాడలేదు. ఉన్నంతలోనే ముగ్గురు కూతుళ్ల పెళ్లిళ్లుచేసి అత్తవారింటికి పంపగలిగారు. నాలుగవ కూతురైన జాహ్నవికి కూడా పెళ్లి చేసి ఆయన బాధ్యతను పూర్తి చేసుకుని నిశ్చింతగా ఉండాలని ఆశ పడుతున్నారు.

కానీ జాహ్నవి పెళ్లి పెద్ద సమస్యగా తోస్తున్నది ఆయనకు. ఆమె గొంతెమ్మ కోర్కెలు, మొండితనం తన ఆర్థిక పరిస్థితికి సవాళ్లుగా నిలుస్తున్నాయి.

ఈలోగా భార్యకు తరచుగా అనారోగ్యం కలగడం, పెళ్లయిన కూతుళ్ల పురుళ్లు, పుణ్యాలు అంటూ వస్తూ పోతూ ఉండడం... వీటితో సతమతమవుతూ ఉన్నారు.

తన అందచందాలమీద ఉన్న శ్రద్ధ చదువు మీద లేకపోవడంతో జాహ్నవి చదువు అంతంత మాత్రంగానే సాగింది. దానికితోడు ఇంటి ఆర్థిక పరిస్థితులు కూడా సహకరించకపోవడంతో ఎలాగో డిగ్రీ పూర్తి చేసాను అనిపించింది. ఒక ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా చేరింది. ఈ సాదాసీదా జీవితానికి ఎప్పుడు స్వస్తి చెప్పడమా? ఎప్పుడు తనకు మంచిరోజులు వస్తాయా అని ఎదురు చూస్తూ ఉంటుంది.

జాహ్నవిని కలల లోకం నుండి వెనక్కు లాక్కువచ్చి వాస్తవాన్ని కళ్లముందు కదిలేలా చేస్తూ ఉంటాయి ఇంటి పరిస్థితులు. అయినా ఆమె మనసు కళ్లెంలేని గుర్రంలా ఎక్కడికో దౌడు తీస్తూనే వుంటుంది, కలల రాకుమారుడికోసం కలవరిస్తూనే ఉంటుంది.

★★★

"అమ్మా జాహ్నవీ! నీ పెళ్లి కూడా చేసేస్తే నా బాధ్యత పూర్తవుతుంది. శాస్త్రిగారు మంచి సంబంధం ఉందని చెప్పారు. వరుడు బాగా చదువుకున్నవాడు, మంచివాడు.''

"మంచి అంటే ఏమిటి నాన్నా? ఊరికే మంచి సంబంధం, మంచివాడు అంటారు. మంచితనం ఏం ఒరగబెడుతుంది నాన్నా. మిమ్మల్నీ, మీ మంచితనాన్నీ చూస్తూనే ఉన్నాను కదా. కారు కొనగలిగారా? మేడ కట్టగలిగారా? ఎందుకూ పనికిరాని ఈ మంచితనం ఎందుకు నాన్నా?''

"అదేమిటమ్మా మంచితనాన్ని మించినది ఏమున్నది చెప్పు. గుణగణాలు వ్యక్తికి ప్రధానం కానీ నువ్వనుకునే సిరిసంపదలు కలకాలం నిలిచేవికావు. అంత గొప్ప సంబంధాలు తెచ్చే తాహతు కూడా నాకు లేదని నీకు తెలుసుకదా.''

"తెలుసుకాబట్టే నాకిప్పుడే పెళ్లి వద్దంటున్నాను. అక్కయ్యలు పెళ్లి చేసుకుని ఏం సుఖపడుతున్నారో చూస్తూనే ఉన్నానుకదా. ఎప్పుడూ ఏదో ఒక లోటుతో అవస్థలు పడుతూనే ఉంటారు. నేను కూడా ఆ రొంపిలోకి దిగదలచుకోలేదు.''

"పొరపాటు పడుతున్నావమ్మా. నువ్వనుకుంటున్నట్లు వాళ్లేమీ కష్టాల ఊబిలో కూరుకుపోయిలేరు. ఉన్నంతలో తృప్తిగానే జీవిస్తున్నారు. నా అల్లుళ్లు ముగ్గురూ బంగారంలాంటి వాళ్లమ్మా! మనబోటి మధ్య తరగతి సంసారాలన్నాక ఏవో ఆర్థికపరమైన ఒడిదుడుకులు వస్తూనే ఉంటాయి.''

"అదేనాన్నా! ఆ ఒడిదుడుకుల సుడిగుండాల్లో నేను పడదలచుకోలేదు. నేను వాళ్లకన్నా ఎక్కువ స్థాయిలో దర్జాగా బ్రతకాలనుకుంటున్నాను.

చూస్తూ ఉండు నాన్నా నా లైఫ్ ఎలా వుంటుందో నీ కళ్లతో నువ్వే చూద్దువుగానీ. నువ్వు తొందరపడి ఈ అనాకానీ సంబంధాలను చూడకు. నేను ఒప్పుకోనంటే ఒప్పుకోను. అంతే''

కూతురు ధీమాగా పలికే ఆ మాటలకు రామచంద్రయ్యగారి దగ్గర సమాధానం లేకపోయింది.



శాస్త్రిగారు చెప్పిన ఆ సంబంధం కూడా వెనక్కుపోయింది.

★★★

'కోరినదే జరిగినదా' అన్నట్లుగా జాహ్నవి ఆశించినట్లుగానే ఒక పెద్దింటి సంబంధం వచ్చింది.

"అమ్మాయి కుందనం బొమ్మలా వుంది. ఇంక మాకు కట్నకానుకలు అక్కర్లేదు'' అన్నారు పెళ్లివారు.

తండ్రి మనసు ఊరట చెందక పిల్లవాడి గురించిన వివరాలు సేకరించారు రామచంద్రయ్యగారు.

అతనికి లేని దురలవాటులేదు. ఆ సంగతే జాహ్నవికి చెప్పారు.

"అమ్మా! వాళ్లు గొప్పవాళ్లే కావచ్చు. కానీ అబ్బాయి మంచివాడుకాదు. చూస్తూ చూస్తూ అటువంటి వాడికిచ్చి నిన్ను కట్టబెట్టడం నాకిష్టం లేదు.''

రాకరాక వచ్చిన గొప్ప అవకాశాన్ని వదులుకోదల్చుకోలేదు జాహ్నవి.

"గొప్పగొప్పవాళ్లకు వాళ్ల స్టేటస్‌కు తగ్గట్టుగా కొన్ని అలవాట్లు తప్పనిసరి నాన్నా. దాని గురించి నువ్వేమీ ఆలోచించకు. నాకీ సంబంధం ఇష్టమే నాన్నా" అంటూ మరోమాటకు అవకాశం ఇవ్వలేదు జాహ్నవి. 'సరే! ఈ తలరాత ఎలా ఉంటే అలా జరుగుతుంది కానీ' అనుకున్నారాయన.

***

పెళ్లయిన ఏడాదిలోపే జగదీష్ ప్రవర్తనవల్ల మానసికంగా చాలా నలిగిపోయింది జాహ్నవి. పిలవగానే పరుగెత్తుకొచ్చే పనిమనుషులు, కావాల్సిన నగలు, బట్టలు... అన్నిటినీ చూసి తనంత అదృష్టవంతురాలు లేదని మురిసిపోయింది మొదట్లో. కానీ జగదీష్ నిజస్వరూపం తెలిసేసరికి ఆనందం ఆవిరైపోయింది. అతనికి తన పక్కన ఒక అందమైన భార్య బొమ్మలాగా కనిపించాలి అంతే. ఆమెకు ప్రత్యేకమైన వ్యక్తిత్వంగానీ, అభిప్రాయంగానీ ఉండకూడదు. అంతేకాకుండా అడుగడుగునా మాటలతోనే చిత్రవధ చేస్తుంటాడు. అలా ఎప్పటికప్పుడు అణచివేయకపోతే భార్య అందులోనూ అందమైన ఆడది తనను డామినేట్ చేస్తుందని అతని భయం. మంచితనం అనేది ముచ్చుకైనా కనిపించదు అతనిలో. ఒంటరిగా ఎక్కడికైనా వెళ్లాలంటే 'సింగారించుకుని ఎవరి దగ్గరకు వెళ్లాలని? నాకన్నా డబ్బున్నవాడెవడికైనా వల వేస్తున్నావా?' అంటాడు. ములుకుల్లా గుచ్చుకునే అతని మాటలను భరించలేకపోయేది జాహ్నవి. ఎప్పుడైనా ఎదురు తిరిగి సమాధానం చెప్పినరోజున ఇంటికి వచ్చాక నానా మాటలు అంటూ ఒక్కొక్కసారి చేయి కూడా చేసుకునేవాడు. రానురాను జీవితం అంటే నరకంలా తయారైంది జాహ్నవికి. పెళ్లయితేనన్నా మారతాడనుకున్న అతని తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయి.

***

"పూజ్యులైన నాన్నగారికి!

జాహ్నవి నమస్కరించి వ్రాయునది. నేను పూర్తిగా ఓడిపోయాను నాన్నా. ఏ తల్లిదండ్రులకైనా పిల్లల క్షేమం కోరి మంచిమాటలు చెప్తారు. అవి తలకెక్కించుకోకుండా పొగరుబోతుతనంతో వ్యవహరించే నాలాటివాళ్లకు తగిన శాస్తి జరగక తప్పదు. మీ అల్లుడు నా అందం చూసి ఏరికోరి నన్ను చేసుకున్నాడని మీరు పొంగి పోతున్నారు. కానీ అది నిజం కాదు నాన్నా. అతనికి అందమైన బానిస కావాలి. కాదు కాదు షోకేసులో బొమ్మలాంటి భార్య కావాలి. అంతే. అందుకే పేదింటి పిల్లయితే చెప్పినట్లు విని తన విలాసాలకు అడ్డు తగలకుండా అణకువగా పడి వుంటుందనే ఉద్దేశ్యంతోనే నన్ను చేసుకున్నారు. అంతస్థులకు ఆశపడి అహంకారంతో మీ మాట కాదని మిమ్మల్ని ఎదిరించి ఈ పెళ్లి చేసుకున్నందుకు ఇప్పుడు నేను అధఃపాతాళంలోకి పడిపోయాను. నాన్నా! అందం, అతిశయం, ఆస్తులు అన్నిటికన్నా మంచితనానికి, మానవత్వానికి విలువ ఎక్కువని ఆలస్యంగా తెలుసుకున్నాను.

జగదీష్ నుండి నేను వేరుపడడానికే నిశ్చయించుకున్నాను. నాకిప్పుడు డబ్బుమీద, ఆడంబరాలమీద వ్యామోహంలేదు. బ్రతుకుమీద ఆశలేదు. కానీ నేను ఏ అఘాయిత్యం చేసుకోను. నేను ఇప్పుడు ఒంటరిదాన్ని కాదు, నా కడుపులో పెరుగుతున్న బిడ్డకోసం బ్రతుకుతాను. నా బిడ్డను నేను మంచితనం, మానవత్వం మూర్తీభవించిన ఉన్నత వ్యక్తిగా, నీ అంతటి గొప్పవాడిగా పెంచుతాను. అవును నాన్నా! నేను నీ గొప్పతనాన్ని అర్థం చేసుకోలేకపోయాను. నీ మనసుకు కష్టం కలిగించినందుకు శిక్షగా అన్నట్లు నాకు నీ ఆఖరి చూపుకూడా దక్కలేదు. అమ్మ పోయాక ఒంటరిగా ఉన్న నిన్ను చూడడానికి కూడా అనుమతించలేదు జగదీష్. నీ మరణవార్త నాకు ఆలస్యంగా తెలిసింది. అందుకు కారణం కూడా జగదీషే. ఇటువంటి మనుష్యులు కూడా ఉంటారా లోకంలో అనిపించే విధంగా కన్నతల్లిదండ్రుల కడసారి చూపుక్కూడా నోచుకోని విధంగా చేసాడు జగదీష్. అందుకే ఇక నా బ్రతుకు నాదే.

ఈ ఉత్తరం అందుకోలేనంత దూరంగా ఉన్నావు నువ్వు. అక్కడికి ఉత్తరం చేర్చడానికి ఏ ప్రయాణ సాధనాలు లేవు. వేయడానికి ఏ పోస్టుడబ్బాలులేవు. తెలియని చిరునామాతో లేని తపాలా పెట్టెలో వేయాలని ఈ ఉత్తరం రాయలేదు. నా మనసుకు ఒకింత ఊరట కలిగించుకోవడానికి, పైనున్న నీ ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ నా ఆవేదనను, పశ్చాత్తాపాన్ని అక్షరరూపంలోకి మార్చి వ్రాసిన ఉత్తరమిది. నీవు జీవించి ఉన్నప్పుడు నాకు బుద్ధి వికసించలేదు. నాకు జ్ఞానోదయమయ్యే సమయానికి నీవు నాకు అందనంత దూరంలో వున్నావు. నీకు ఎంతో మనస్తాపం కలిగించి నిన్ను నా మొండితనంతో, అజ్ఞానంతో ఇబ్బంది పెట్టినందుకు అశ్రుపూరిత నయనాలతో నిన్ను క్షమాపణలు వేడుకుంటున్నాను. నువ్వు ఎక్కడున్నా నన్ను క్షమిస్తావని ఆశిస్తున్నాను. నన్ను క్షమించు నాన్నా! అహంకారంతో అంధకారం నుండి మంచితనం అనే వెలుగు దారివైపు పయనిస్తున్న నీ కుమార్తె..

జాహ్నవి"

★

## ఆఫీసులో నిద్రవల్ల లాభం

ఆఫీసులో కాసేపు కునుకు తీయడం బాస్ చూస్తే కంగారు పడనక్కర్లేదుట. అలా పని మధ్యలో కొంచెంసేపు రిలాక్స్ కావడంవల్ల తరువాత చురుగ్గా పని చేయగలుగుతున్నామని బాస్‌తో ధైర్యంగా చెప్పవచ్చునట. ఇటీవల అమెరికాలో జరిగిన ఓ రీసెర్చ్ పరిశీలనలో ఈ నిజం వెల్లడైంది. మేగజైన్లు చదివినవాళ్లకన్నా, ఏదో వినోద చిత్రాలు చూసినవాళ్లకన్నా ఓ గంట నిద్రపోయినవాళ్ల జ్ఞాపకశక్తి మెరుగ్గా ఉంటుందని ఆ పరిశోధనలో తేలింది.

## తొలి జాబు రాసిన వ్యక్తి

మొట్టమొదటి ఉత్తరం రాసిన వ్యక్తి స్పెయిన్‌కు చెందిన సెవిల్లీ వాస్తవ్యుడు డాక్టర్ డిగో అల్వారెజ్ ఛాంకో కావచ్చు. 1494 ఫిబ్రవరి రెండున ఈ ఉత్తరం పోర్ట్ ఆఫ్ ఇసబెల్లాలోని శాన్‌డామింగోలో సెవిల్లీ పురపాలక సంఘానికి పంపేందుకు తపాలా పెట్టెలో వేశాడు. ఇది 1494 ఏప్రిల్ ఎనిమిదిన సెవిల్లీకి చేరింది.

## పొగమానేసిన మనిషి

తొలినాళ్లలో ఒక వ్యక్తి పొగత్రాగడం మానివేసిన సందర్భానికి సంబంధించిన ఉదంతం 1679 ఏప్రిల్ ఐదున జరిగింది ఆరోజున ఫిన్లాండ్ (యూరప్)కు చెందిన టుర్కు షరీఫ్ జవాహాన్ కట్సూ తన డైరీలో ఇలా రాసుకున్నాడు 'నేను పొగత్రాగడం మానివేస్తున్నాను'. ఆ తర్వాత ఒక నెల రోజులకు అతడు మరణించాడు.

-బిద్దిగం

## వార్ధక్యం

వయసుతోపాటు వచ్చే వివిధ రకాల వ్యాధులు, నీరసాలను తగ్గించే శక్తి ఉసిరికాయకు ఉంది. చర్మం నిగారింపు రావడంతోపాటు వృద్ధాప్యంలో చర్మం ముడతలు పడడం, కీళ్ళనొప్పులు, తలనెరయడం, చూపు తగ్గుదలలాంటి సమస్యలు ఉన్నప్పుడు ఉసిరి పచ్చడో, రసమో, లేహ్యామో ఏదో రూపంలో ఉసిరిని తరచుగా తీసుకుంటే మంచి ఉపశమనం కలుగుతుంది.

-తటవర్తి